


# ఆకుపచ్చ త్రాచుపాము

— గంటి రమాదేవి

"పేరు?"

"ఫణికుమారి. కాలేజ్‌లో "కళ్యాణి" అని పిలుస్తారు.

"బయట బోర్డు చూశారా?"

"ఊ...రావ్.ఎస్.రోకా; సైకో - ఎనలిస్ట్, హిప్నోథిరపిస్ట్...యు.ఎస్.ఎ ట్రైండ్..."

"ఏమిటి మీ ప్రాబ్లం..."

నా కన్సల్టింగ్ రూములో ఎదురుగా కూర్చున్న పద్దెనిమిది సంవత్సరాల యువతినుద్దేశించి అడిగాను. సన్నగా, పొడుగ్గా వుంది. బలహీనంగా లేదు. ఆరోగ్యం, యవ్వనం కలయిక వల్ల కలిగిన మెరుపు కనుపిస్తోందిముఖంలో. అయితే కళ్ళు రోదసిలో నుండి సముద్రాన్ని చూస్తే కనుపించే రీతిలో అ నలుపు, నీలం కలయికతో, నీటితో నిండిన మేఘ శకలాల్లాగు వున్నాయి.

సైకో ఎనాలిసిస్, హిప్నోథిరపీకి ఇండియా లో అంత ప్రాచుర్యంలేదు. దంత వైద్యుడు దగ్గరకు వెళ్ళడానికి వెనుకాడే మనవాళ్ళు, సైకో ఎనాలిసిస్, హిప్నోథిరపీ అంటే ఆమడ దూరం వుంటారు. దంత వైద్యుడు దగ్గరకు పళ్ళు పీకించుకోడానికి వెళ్ళినట్టు, బాగా పిచ్చి ముదిరిన వాళ్ళు ఇద్దరు, ముగ్గురు వచ్చారు నా దగ్గరికి. "నేను పిచ్చి బాగు చేసే డాక్టరును కాను — మానసిక రుగ్మతలు — అంటే పైకి మామూలుగా కనుపిస్తూ — నివురు గప్పిన నిప్పులా, లోలోపల వ్యాధి. — వున్న వాళ్ళకు వైద్యం చేస్తాను" అని నా దగ్గరకు వచ్చిన వాళ్ళకు చెప్పాను. ఆ తర్వాత ఒక్కడు రాలేదు. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఈ అమ్మాయి. ఈ అమ్మాయి కూడా చికిత్స కోసం రాలేదని నాకెందుకో అనిపించింది.

"నాకేమీ సమస్య లేదు..."

నేననుకున్నది నిజమే.

"మరి..."

"పాములు పగబడతాయా?..."

ఆ ప్రశ్న విని నాకు తిక్క రేగింది. ఏమిటి? వీళ్ళకు నేనేదో వెర్రి వెంగళప్పలా కనపడుతున్నానా? ప్రాక్టీసు లేని డాక్టరని వూసుపోక నాదగ్గరకు వస్తున్నారా?

"దానికి నా దగ్గరకు రానక్కరలేదు. 'పాములు పగబడతాయా' అన్న అంశం మీద 'చర్చా వేదిక' చదవండి వీక్లీలో. పాముల మీద ఈ మధ్యన రచయితలకు, ఎడిటర్లకు ప్రేమ పెరిగిపోయింది. పాముల మీద రెండు, మూడు నవలలు కూడా వచ్చాయి. అవి చదవండి...ఏ పెద్ద లైబ్రరీకి వెళ్ళినా పాముల మీద పుస్తకాలే వున్నాయి..."

ఛేజ్ పుస్తకం "టైగర్ బై టైల్" పుస్తకం చేతిలోకి తీసుకుంటూ అన్నాను. రోజంతా "ఛేజే" నా పేషంటు. "ఛేజ్"తో సంతోషంగా గడిచి పోతోంది, ఆదాయం లేకపోయినా.

"కోప్పడకండి డాక్టర్...నా సమస్య వింటే మీరే అర్థం చేసుకుంటారు..."

ఆమె కళ్ళలో మేఘ శకలం వర్షించడానికి సిద్ధంగా వుంది.

దీనంగా వున్న ఆమె ముఖం చూసి, నా కోపం చల్లారింది.

"ఇంతకు ముందు, మీకేం సమస్య లేదన్నారు..."

"అవును. సైకో ఎనాలిసిస్‌కు సంబధించినంత వరకు నాకేం సమస్యలు లేవు..అయితే.."

లెదర్ బ్యాగ్ తెరచి అయిదారు పేజీలు వున్న కాగితాల కట్ట తీసింది. ఫూల్స్‌కాప్ సైజులో, పరీక్ష పేపర్లలా మధ్యకు మడత పెట్టబడి వున్నాయి. తర్వాత చెప్పడం ప్రారంభించింది.

"సుమన్ మా అన్నయ్య. కాలేజీలో బి.ఎస్.సి. పూర్తి చేసి, ఎం.ఎస్.సి. మొదటి సంవత్సరం, తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ లో చదివేవాడు..."

మధ్యలో కలుగ చేసుకుని అన్నాను.

"చదవేవాఢు అంటున్నారు...ఇప్పుడు..."

బొట బొటా ఆమె కళ్ళ వెంట రెండు కన్నీటి చుక్కలు టేబులుపై పడ్డాయి. అంతలోనే దుఃఖాన్ని ఆపుకుని, రుమాలుతో కళ్ళు తుడుచుకుని, తాను మామూలుగానే వున్నానని చెప్పడానికేమో, చిరునవ్వు నవ్వింది పేలవంగా.

"మా అన్నయ్యకు ఇరవై రెండు నిండి ఇరవై మూడు వచ్చాయి. మంచి పొడగరి. నల్లటి గిరజాల జుట్టు. మెరిసే చక్కటి కళ్ళు. తెలివి తేటలు సూచిస్తూ, విశాల ఫాలం. ఎప్పుడూ కళ కళలాడుతూ వుండేవాడు. అయితే క్రితం సంవత్సరం అక్టోబరులో దసరాలకు వచ్చినప్పుడు అన్నయ్య తీరే మారిపోయింది. ఎక్కడో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ వుండేవాడు. రెండో రోజు నేనే అడిగాను, అలా ఎందుకున్నావని..."

మధ్యలో ఆపి అడిగాను

"ఇప్పుడు సుమన్ ఎక్కడున్నాడు?..."

"చచ్చిపోయాడు...పాము కాటుకు గురై.. ఆకుపచ్చని త్రాచుపాము..."

* * *

"నాకు అప్పుడు ఆరేడేళ్ళు వుండవచ్చు. అన్నయ్యకు పదినిండి పదకొండు వచ్చాయి. మా నాన్నగారు నీరజాక్షరావు గారు, పట్టాభిరామయ్యగారు ఇద్దరు, ఉమ్మడిగా రైస్‌మిల్లు నడిపేవారు. సుమన్ కన్న పెద్దావిడ మా అక్క విమల. సుమన్ కన్న ఆరేళ్ళు పెద్దది.

రైస్ మిల్లులో లాభాలు బాగానే వస్తూ వుండేవి.

అక్కకు సంబంధాలు చూడడం ముదలు పెట్టారు. కట్నం వేల మీద కావాలని, లాంఛనాలు జరిపించాలని గొంతెమ్మ కోరికలు కోరడం మొదలు పెట్టారు, వచ్చిన మగ పెళ్ళివారు. అందుకు కారణం, అక్క అంత అందగత్తెకాదు.

రైస్‌మిల్లులో తన వాటా అమ్మివేస్తేగాని, కట్నానికి పెళ్ళి ఖర్చులకు సరిపోయే డబ్బు రాదు. మామూలు పరిస్థితులలో ఇంటి మీద అప్పు తీసుకు రావచ్చు. ఉమ్మడి యజమాని పట్టాభిరామయ్య దగ్గర అప్పు తీసుకోవచ్చు. అక్క అనాకారి కావడం వల్ల, మంచి సంబంధం టీసుకురావాలనే మా అమ్మ పట్టుదల వల్ల, తర్వాత ఏమయితే అదవుతుందనే మా నాన్న వేదాంత ధోరణి వల్ల, రైస్‌మిల్లులో ఆయన తన వాటా అమ్మివేయడానికే నిశ్చయించుకున్నాడు. పట్టాభిరామయ్య, నాన్న వాటా కొనడానికి వప్పుకున్నాడు. మొత్తం నలభై తొమ్మిది వేలకు బేరం కుదిరింది.

డాక్యుమెంట్ల మీద సంతకాలయిన తర్వాత, పట్టాభిరామయ్య నలభైతొమ్మిది వేలు మా నాన్నకు ఇచ్చేశాడు. డబ్బు ఇస్తూ పట్టాభిరామయ్య, నవ్వుతూ నాన్నతో అన్నాడు.

"ఏమయ్యా! నీరజాక్షరావు! మిల్లులో నీకున్న వాటా అమ్మేశావు. అమ్మాయి పెళ్ళికి డబ్బంతా ఖర్చు పెట్టేస్తావ్. తర్వాత, ఇదే మిల్లులో గుమాస్తాగా పనిచేయాలి. ఈ అవస్థంతా ఎందుకుగాని, విమలను మా అబ్బాయికి ఇచ్చి చెయ్యి...నాకేమీ కట్నం వద్దు సుమా... మామూలుగా పెళ్ళి చెయ్యి చాలు. నువ్వు వూ అంటే ఈ డాక్యుమెంట్లు చింపేసుకుందాం. నా డబ్బు నాకిచ్చేయి..."

పట్టాభిరామయ్య మనస్తత్వం కనిపెట్టలేకపోయాడు వెర్రిబాగుల నాన్న. వెంటనే వప్పేసుకున్నాడు. ఆ రోజే వెళ్ళి అతి కష్టం మీద కుదుర్చుకున్న సంబంధం క్యాన్సిలు చేసుకుని వచ్చేశాడు.

ఇంటికొచ్చేవరకు, అమ్మ చెప్పేంతవరకు, నాన్నకు తెలియదు; పట్టాభిరామయ్య కొడుక్కి వున్న భయంకరమైన జబ్బు విషయం తెలియగానే కలవరపడిపోయాడు. అక్క పెళ్ళి విషయంలో సర్వం త్యాగం చేయడానికి వప్పుకున్న నాన్న ఆఖరికి పరిస్థితులిలా ఎదురు తిరగడంతో మనస్థాపనికి గురయ్యాడు.

మళ్ళీ పట్టాభిరామయ్య దగ్గరకు వెళ్ళి డబ్బు కావాలన్నాడు. పట్టాభిరామయ్యతో వియ్యం తనకిష్టంలేదని చెప్పేశాడు. పట్టాభిరామయ్య ఉగ్రుడయ్యాడు. అయితేనేం తిరిగి డబ్బిచ్చాడు. తిరిగి పెళ్ళివారింటికి వెళ్ళి, బతిమిలాడాడు, సంబంధం వప్పుకోమని...వాళ్ళు లొంగి రాలేదు. ఊరినుంచి ఇంటికి తిరిగి వస్తూ, పరధ్యానంగా పార్ట్‌నర్‌షిప్ డీడ్ మీద మళ్ళీ సంతకం పెట్టాడు. పట్టాభిరామయ్య, నిన్న చింపేసిన డాక్యుమెంట్లు మళ్ళా తయారు చేయించాడు. ఇంటికి వస్తూవుండగా దారిలో కొందరు అటాకాయించి డబ్బులాక్కున్నారు. తన దురదృష్టానికి చింతిస్తూ ఇంటికి వచ్చాడు నాన్న. కోపంలో మా అమ్మను, అక్కను, తిట్టేడు.

ఇంత జరిగిన తర్వాత మళ్ళీ తనను మిల్లుకు రానిస్తాడా, పట్టాభిరామయ్య అని మీమాంస పడుతూంటే పట్టాభిరామయ్య, తనే వచ్చాడు మాఇంటికి. మాటలలో తెలిసింది. మొదట వ్రాయించిన పార్ట్‌నర్ షిప్ డీడ్ చించకుండా తన దగ్గరే వుంచుకున్నాడు. పట్టాభిరామయ్య వట్టి తెల్లకాగితాలు చింపేడు. రెండోరోజు నలభై తొమ్మిది వేలకు ప్రామిసరీ నోటు మీద సంతకం పెట్టించుకున్నాడు. నాన్న వున్న మానసిక స్థితిలో ఎవరయినా సంతకం పెట్టే స్తారు. క్రొత్త డాక్యుమెంట్లు అనుకుని, రూపాయలు వ్రాసిన పంక్తి చదివి సంతకం పెట్టేశాడు, అది ప్రామిసరీ నోటు అని తెలియక.

ఇరవై వేలయినా చెయ్యని ఇల్లు. నలభై తొమ్మిది వేలకు తాకట్టు పెట్టుకున్నట్టు వ్రాయించాడు. పరధ్యానంగా ఇంటికి వస్తూ వున్న నాన్న డబ్బు దొంగిలించింది, పట్టాభి రామయ్య మనుషులే అని ఆ మర్నాడే తెలిసింది.

**ఇంత జరిగిన తర్వాత మళ్ళీ తనును మిల్లుకు రానిస్తాడా పట్టాభిరామయ్య అని మీమాంస పడుతుంటే తనే వచ్చాడు మా ఇంటికి. మాటలతో తెలిసింది — మొదట రాయించిన పార్ట్‌నర్‌షిప్ డీడ్ చించకుండాదగ్గరే వుంచుకున్నాడు. రెండో రోజు నలభై తొమ్మిది వేలకు ప్రామిసరీనోటు మీద సంతకంపెట్టించుకున్నాడు.**

రెండు రోజులలో, కలకలలాడే మా కుటుంబం, ఎండిన మోడులా తయారయింది. చిరాగ్గా ఏదో అన్నారని నూతిలో దూకి ప్రాణం తీసుకుంది విమలక్క. ఆ దుఃఖం నుండి కోలుకోక ముందే, పట్టాభిరామయ్య తనకి రావలసిన బాకీ గత నాలుగేళ్ళనుండీ చెల్లువేయలేదంటూ దావా వేశాడు. ప్రామిసరీ నోటు రిజిస్ట్రేషన్, మూడేళ్ళ తర్వాత "లా ఆఫ్ లిమిటేషన్" ప్రకారం తిరగ వ్రాయించడం, ఇవన్నీ ఎలా సాధించాడో పట్టాభిరామయ్య...ఉద్యోగం లేక, తిండికే కటకటగా వున్న నాన్న కోర్టుకు వెళ్ళక నిర్లిప్తంగా వుండి పోయాడు.

కోర్టునుండి 'సమన్సు' కోసం చూస్తూ వున్న నాన్న మానసిక పరిస్థితి ఊహాతీతంగా మారిపోయింది. తనని ఇంతవరకు గౌరవించిన సంఘం, మనుషులు, ఇప్పుడు హేళనగా చూడడంతో, ఆయన మనస్సులో ఏదో తెలియని కసి ఏర్పడింది.

ఒకరోజు అర్ధరాత్రి పెద్దగా అరిచిన అరుపులకు, నేనూ, అన్నయ్య వులిక్కిపడి లేచాము. నాన్న చేతిలో కత్తివుంది. అగమ్యంగా వున్న భవిష్యత్తులో పయనించే కన్న, కుటుంబంతో సహా బతుకులు చాలించడమే మేలనుకున్నారో ఏమో కత్తి తెచ్చారు. అయితే, ప్రేమపాశం ఆయనను వెనక్కు లాగింది. మమ్మల్నీ, అమ్మను, చంపి, తనను తాను పొడుచు కుందామనుకున్న, మా నాన్న కత్తి క్రిందికి విసిరి, చీకట్లో కలిసిపోయారు.

మర్నాడు పొగమంచులో వస్తూన్న ఆకారాల్ని గుర్తుపట్టి అమ్మ గొల్లుమంది. చెరువులో దూకి తన జీవితానికి స్వస్తి చెప్పాడు నాన్న.

అప్పుడే, విషయావగాహన అవుతూన్న అన్నయ్య నాతో అన్నాడు...నీళ్ళు గడ్డ కట్టే చలిలో, నాన్న చెరువులో ఎలా దూకారు?

* * *

తర్వాత ఆవూరు విడిచి మా తాతగా రుంటున్న వూరు వచ్చేశాం. మేమిద్దరం అక్కడే పెరిగాం.

దసరాలకు వచ్చినప్పుడు, నేనడిగిన ప్రశ్నకు, అన్నయ్య అన్నాడు: "ఫణీ! ఇన్నాళ్ళకు కన పడ్డాడు పట్టాభిరామయ్య...విమలక్కను తన కొడుక్కి ఇవ్వలేదన్న కోపంతో పగతో మన్ని నాశనం చేసిన, పట్టాభిరామయ్య... నాన్న అకాల మరణానికి కారకుడు..."

అన్నయ్యకు ఇంకా ఆ విషయాలు జ్ఞాపకమున్నాయి. పట్టాభిరామయ్య అంటే నా మనస్సులో కోపమే కాని ప్రతీకారం తీర్చుకోవాలని లేదు.

"పట్టాభిరామయ్యను అంతం చేసి నాన్న మనస్సుకు శాంతి కలుగజేస్తాను..."

మంచి విద్యాధికుడయి, సుఖంగా జీవనం వెళ్ళబుచ్చు కుంటాడనుకున్నా అన్నయ్య, పట్టాభిరామయ్య మీది పగతో చిరునవ్వు మరచి పోయాడు.

"వాడు ఇప్పుడెక్కడున్నాడు?..."

"నా క్లాస్‌మేట్ శేషగిరి తండ్రి పట్టాభిరామయ్య. నాన్న చెబుతూ వుండేవాడు పట్టాభిరామయ్యకు ఆరు వేళ్ళున్నాయని. యధాలాపంగా, శేషగిరితో వాళ్ళింటికి వెళ్ళాను. చిన్నప్పటి నేను చూసిన పట్టాభిరామయ్యకు ఈయనకు ఏమీ తేడాలేదు. చేతికి ఆరు వేళ్ళున్నాయి. పైగా చేతి మీద "పి.రామయ్య..." అన్న పచ్చబొట్టువుంది..."

"అయితే వాడిని ఏం చేయాలను కుంటున్నావ్?"

ఈ మాత్రం తెలీదా అన్నట్టు నాకేసి చూశాడు అన్నయ్య...

"వాడు పట్టుబడకుండా నాన్న చావుకు ఎలా కారణమయ్యాడో, అలాగే నేను కూడా, పట్టుబడకుండా వాడిని హత మారుస్తాను."

"ఎలా..."

"చెప్తా..."

* * *

ఫణికుమారి తన చేతిలో కాగితాల కట్టను నాకు అందించింది...

"అది మా అన్నయ్య వ్రాసింది... చదవండి..." అంది.

"ఫణీ! పట్టాభిరామయ్యను ఎలా...అని అడిగావు కదూ...అదే నేను ఈ నాలుగు నెలలు ఆలోచించాను...ఏ మార్గమూ సురక్షితంగా వున్నట్టులేదు...అయినా తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఇవాళ అక్టోబరు 31.మళ్ళీ పదిహేను రోజులలో వ్రాస్తా...ఇట్లు సుమన్..."

రెండో కాగితం తెరిచాను.

ఫణీ!

శేషగిరి ఇంటికి వెళ్ళాను. పట్టాభి రామయ్యతో పరిచయం పెరిగింది. పట్టాభిరామయ్య నిజంగా పాము. అయితే ముసలి పాము.

పట్టాభిరామయ్య తనకోసం ప్రత్యేకంగా ఒక గది కట్టించుకున్నాడు. రాత్రి ఆ గదిలోనే పడుకుంటాడు.

ఆ గదికి వెళ్ళే దారిలో ఒక పాము పుట్టవుంది. దాన్ని పట్టాభే పెంచుతున్నాడుట..., పాముకు, పాముతోనేగా స్నేహం.. ఇంకా ఉపాయం తట్టలేదు...

మళ్ళీ వ్రాస్తా... నెలాఖరులోగా...

సుమన్ మూడో ఉత్తరం ఇలా మొదలయింది.

"శేషగిరి ఇంటి నుంచి పట్టాభిరామయ్య గదివైపు వెళుతూవుండగా ఒక చిత్రం చూశాను.



పాముపుట్టలో చెయి పెట్టి పామును బయటకు తీశాడు పట్టాభిరామయ్య...ఆశ్చర్యంతో నోటమాట రాక.చూస్తున్న నాకు, ఆ పాము రంగు చూసి ఇంకా ఆశ్చర్యం వేసింది... నల్ల త్రాచు చూశాను...గోధుమ త్రాచు చూశాను. ఎడారులలో ఎఱ్ఱి త్రాచు వుంటుం దంటారు. ఏదో పుస్తకంలో చూశాను. అయితే ఇది ఆకుపచ్చ రంగులో వుంది. దాదాపు అయిదడుగుల పొడవుంది. పెంపుడు కుక్క, యజమాని చేతిలో వాలినట్టుగా, పట్టాభి రామయ్య చేతికి చుట్టుకుని

